## క్లుప్తంగా

### భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ నియామకం

**తగరపువలస:** భీమిలి వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీ నియామకాన్ని గురువారం రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ విడుదల చేసింది. ఈ కమిటీ గౌరవ అధ్యక్షునిగా భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వ్యవహరిస్తారు. చైర్మన్‌గా కురిమిన రామస్వామినాయుడు, వైస్ చైర్మన్‌గా పిన్నింటి జగన్నాథం నియమితులయ్యారు. సభ్యులుగా చెట్ల రమాదేవి, గుడ్డాల కృష్ణ, కాళ్ల శ్రీనివాసరావు, కంది లక్ష్మీనారాయణ, కరిమిరెడ్డి లక్ష్మి, కేశం గురుమూర్తి, కుప్ప రామలక్ష్మి, మారికి నూకరాజు, ఉప్పాడ గౌరి, వాళ్ల నందిని, అనుములశెట్టి సత్య కామేశ్వరరావు, వసంత శ్యామల, పగడాల గురునాయుడు ఉన్నారు. వీరితో పాటు వేములవలస పీఏసీఎస్ పీఐసీ, వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్, జీవీఎంసీ మేయర్, జిల్లా వ్యవసాయ, వాణిజ్య, మార్కెటింగ్ అధికారి సభ్యులుగా ఉంటారు.

### భక్తితో సౌమ్యగిరి ప్రదక్షిణ



గిరిప్రదక్షిణ చేస్తున్న భక్తులు

**భీమునిపట్నం:** ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని భీమిలిలోని సౌమ్యగిరి ప్రదక్షిణను భక్తులు గురువారం భక్తిశ్రద్ధలతో చేశారు. పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ముందుగా నర్సింహస్వామి ఆలయ గోపురం మెట్ల వద్ద అర్చకులు రొంపిచర్ల ప్రసాద్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు నమో నారసింహ అంటూ కొండ చుట్టూ సుమారు ఎనిమిది కిలోమీటర్లు గిరి ప్రదక్షిణ చేశారు.

### శ్రీవారికి విశేష అభిషేకాలు



గంధంతో శ్రీవారిని అభిషేకిస్తున్న అర్చకుడు

**భీమునిపట్నం:** భీమిలి కృష్ణా కాలనీ కొండపై ఆలయంలో కొలువుదీరిన కల్యాణ వేంకటేశ్వర స్వామికి గురువారం విశేష అభిషేకాలు నిర్వహించారు. ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని అర్చకులు అప్పలాచార్య ఆధ్వర్యంలో చందన, ఫల, పుష్ప, పంచామృతాలతో స్వామిని అభిషేకించారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఏర్పాట్లు పర్యవేక్షించింది.

### విజయరామరాజుకు నివాళి



విజయరామరాజు సమాధి వద్ద నివాళులర్పిస్తున్న అప్పల నర్సింహరాజు

**పద్మనాభం:** పద్మనాభం యుద్ధంలో వీరమరణం పొందిన విజయనగరం సంస్థానాధీశుడు పూసపాటి రెండో చిన విజయరామరాజు సంస్మరణ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. పద్మనాభంలో ఉన్న ఆయన సమాధిపై భీమునిపట్నం మాజీ ఎమ్మెల్యే ఆర్ఎస్‌డీపీ అప్పల నర్సింహరాజు, నేతలు పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. కార్యక్రమంలో కృష్ణాపురం ఎంపీటీసీ సభ్యురాలు కె.లక్ష్మి, కె.దామోదరరావు, కె.రమణ పాల్గొన్నారు.

### ఇంటింటా చెత్త సేకరణ పరిశీలన



టి.నగరపాలెంలో చెత్త సేకరణను పర్యవేక్షిస్తున్న డీఎల్‌డీవో నిర్మలాదేవి

**తగరపువలస:** ఇంటింటా చెత్త సేకరణపై గురువారం డివిజనల్ లెవెల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ నిర్మలాదేవి భీమిలి మండలం టి.నగరపాలెం పంచాయతీలో పర్యటించారు. చెత్త సేకరణలో ఎదురవుతున్న సమస్యలపై పారిశుధ్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. చెత్త విభజన గురించి మహిళలకు సూచించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పాట్నూరు చంద్రశేఖర్, పల్లా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

### సచివాలయానికి కంప్యూటర్ బహూకరణ

**తగరపువలస:** భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబొరేటరీ యాజమాన్యం పెదనాగమయ్యపాలెం గ్రామ సచివాలయానికి రూ.71,500 విలువ చేసే కంప్యూటర్, ప్రింటర్‌ను గురువారం బహూకరించింది. కార్యక్రమంలో దివీస్ ప్రతినిధులు ఎ.శ్రీనివాస్, కె.నరసింహ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# గురుకుల భవనాలపై నిర్లక్ష్యపు నీడ

- గత ప్రభుత్వ హయాంలో కోట్ల రూపాయలతో నిర్మాణం
- ఎన్నికల కోడ్ కారణంగా చివరి దశలో ఆగిన పనులు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- ప్రారంభించకుండానే మూలకు చేరుతున్న వైనం



మారికవలస బాలికల ఎస్‌వోఈలో పనులు పూర్తయిన భవనం



అస్తవ్యస్తంగా గదులు

**మధురవాడ:** కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన భవనాలు ప్రారంభానికి ముందే మూలకు చేరుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలోనే 90శాతం పనులు పూర్తయినా, తర్వాత వచ్చిన కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. మారికవలస ఏపీ గిరిజన గురుకుల సంక్షేమ బాలికల ఎస్‌వోఈ, తిమ్మాపురం రోడ్డులోని మారికవలస ఏపీ గిరిజన గురుకుల ఇంగ్లిష్ మీడియం స్కూళ్లలో నిర్మించిన అదనపు పాఠశాల భవన సముదాయాల పరిస్థితి ఇదీ..



ఎస్టీ గురుకుల ఇంగ్లిష్ మీడియం స్కూల్లో నిరుపయోగంగా ఉన్న భవనం

**ఒక్క అడుగూ.. ముందుకు సాగక..**

విద్యకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బాల బాలికలకు విశాలమైన, అన్ని వసతులతో కూడిన భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఈ రెండు గురుకులాల్లో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.6.40కోట్లు అంచనా వ్యయంతో పనులు ప్రారంభించారు. రెండు చోట్ల సుమారు అర ఎకరం విస్తీర్ణంలో సువిశాలంగా భవనాల నిర్మాణం చేపట్టారు. ఇంతలో సార్వత్రిక ఎన్నికల కోడ్ రావడంతో చివరి దశలో పనులు ఆగిపోయాయి. అప్పటి నుంచి నిర్మాణంలో ఒక్క అడుగు కూడా ముందుకు కదల్లేదు.

**దాదాపు పూర్తయినా..**

విశాలమైన ఈ భవనాల్లో అని వసతులు కల్పించారు. తరగతి గదులు, వరండా, డైనింగ్‌హాల్, డార్మిటరీ, మరుగుదొడ్లు, స్విచ్‌బోర్డులతో సహా అన్ని సౌకర్యాలతో భవనాలను నిర్మించారు. పెయింటింగ్ పనులు కూడా పూర్తయ్యాయి. అయితే, తర్వాత పట్టించుకోకపోవడంతో గురుకుల ఎస్‌వోఈలో మెయిన్ పిల్లర్లను ఆనుకుని ఉన్న గోడలు బీటలు వారాయి. గురుకుల ఇంగ్లిష్ మీడియం స్కూల్లో చాలా చోట్ల కిటికీల అద్దాలు, కిటికీలు దెబ్బతిన్నాయి. ఆకతాయిలు లోపలికి ప్రవేశించి మెష్‌డోర్లు చించి వేయడంతో అస్తవ్యస్తంగా ఉంది.

దీనిపై రెండు గురుకులాల ప్రిన్సిపాళ్లు నోరు మెదపడం లేదు. పాడేరు ఐటీడీఏ ఈఈ డేవిడ్ రాజును వివరణ కోరే ప్రయత్నం చేయగా అందుబాటులోకి రాలేదు. ఉన్నత స్థాయి అధికారులైనా స్పందించి, భవనాలను అందుబాటులోకి తీసుకువస్తే విద్యార్థులకు మరింత సౌకర్యవంతంగా ఉంటుందని పలువురు కోరుతున్నారు.



పగిలిపోయిన కిటికీలు అద్దాలు

## వైఎస్సార్‌సీపీ సమావేశానికి ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న చిన్న శ్రీను

**కొమ్మాది:** ఎండాడలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఈ నెల 13వ తేదీన నిర్వహించనున్న భీమిలి నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశానికి సంబంధించిన ఏర్పాట్లను పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. ముందుగా ఆయన ముఖ్యనాయకులతో మాట్లాడారు. కార్యాచరణ ప్రణాళికను ఖరారు చేసి, కార్యకర్తలకు, నాయకులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని సూచనలు చేశారు. ఆదివారం ఉదయం 10 గంటలకు జరిగే సమావేశానికి ప్రతి ఒక్కరూ తప్పక హాజరు కావాలని పిలుపునిచ్చారు.

**పర్యటనపై ఆంక్షలెందుకు?**

వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మామిడి రైతుల కష్టాలు తెలుసుకునేందుకు చేపట్టిన బంగారుపాలెం పర్యటనలో ఆంక్షలు పెట్టడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రైతుల కష్టాలు తెలుసుకునేందుకు పార్టీ అధినేత వస్తే, కూటమి ప్రభుత్వం ఆంక్షలు విధించడమేమిటంటూ ప్రశ్నించారు. రైతులపై, కార్యకర్తలపై ఎస్పీ స్థాయి అధికారి స్వయంగా లాఠీచార్జి చేయడం దుర్మార్గమన్నారు. వేలాది మంది పోలీసులను మోహరించడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. రైతుల కోసం జగన్ పోరాటం చేస్తుంటే అణిచివేత చర్యలు తీసుకోవడం బాధాకరమన్నారు. ఎన్ని ఆటంకాలు సృష్టించినా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఆపగలిగే దమ్ము కూటమి ప్రభుత్వానికి లేదన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ అరాచక పాలన చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, ఎంపీపీలు దంతులూరి వాసురాజు, కంటుబోతు రాంబాబు, కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, నాయకుడు మజ్జి వెంకట్రావు, వార్డు అధ్యక్షులు గుడ్ల పోలిరెడ్డి, పోతిన శ్రీనివాసరావు, పోతిన హనుమంతు, బొట్టా అప్పలరాజు, మండల అధ్యక్షులు గాడు శ్రీను, బంక సత్యం, నాయకులు సిరమ్మ, ఇల్లాపు వెంకట్ తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## పదోన్నతిపై వెళ్తున్న అధికారికి సత్కారం



మురళీ మోహన్‌ను సత్కరిస్తున్న పద్మనాభరాజు

**పీఎం పాలెం:** బక్కన్నపాలెం ఏపీఎస్పీ పోలీస్ బెటాలియన్‌లో పనిచేస్తూ, పదోన్నతిపై బదిలీ అయిన మురళీ మోహన్‌కు అధికారులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. మురళీ మోహన్ ఇక్కడ ఆర్ఎస్ఐగా పనిచేస్తూ 3వ పోలీస్ బెటాలియన్‌కు ఆర్ఐగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా వీడ్కోలు సత్కారసభ ఏర్పాటు చేసి ఆయనను ఘనంగా సన్మానించారు. బెటాలియన్ కమాండెంట్ పద్మనాభరాజు మాట్లాడుతూ మురళీ మోహన్ విధినిర్వహణలో అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి అడిషనల్ కమాండెంట్ పి.సత్యం, అసిస్టెంట్ కమాండెంట్లు ఎస్.మురళీధర్ బి.రామకృష్ణ, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, బెటాలియన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పాఠశాలల్లో సమస్యల ఏకరువు

- చంద్రంపాలెం హైస్కూల్ బయట డ్రగ్స్ బ్యాచ్, ఆకతాయిల వేధింపులు
- మధ్యాహ్నం వరకు ఎమ్మెల్యే కోసం ఎదురుచూపులు
- పార్టీ మీటింగ్‌లను తలపించిన మెగా పేరెంట్ టీచర్ సమావేశాలు
- గురుకుల సీవోఈలో పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయని టెంట్లు



కస్తూర్బా విద్యాలయం వద్ద తల్లులకు పాదాభిషేకం చేస్తున్న విద్యార్థినులు

**మధురవాడ:** పాఠశాలల్లో గురువారం నిర్వహించిన మెగా పేరెంట్ టీచర్ సమావేశాలు పార్టీ మీటింగ్‌లను తలపించాయి. పాఠశాలల యాజమాన్యాలు ప్రోటోకాల్ నిబంధనలను పట్టించుకోకుండా టీడీపీ నాయకులకే పెద్ద పీట వేశారు. విశాఖ రూరల్ మండలం మధురవాడ పరిసర ప్రాంతాలలో పలు పాఠశాలల్లో తల్లిదండ్రులు సమస్యలు ఏకరువు పెట్టారు. వీటిలో ప్రోటోకాల్ నిబంధనలు పట్టించుకోకుండా యాజమాన్యాలు టీడీపీ నాయకులకే పెద్ద పీట వేసి వారి పార్టీ మీటింగ్‌లను తలపించే విధంగా నిర్వహించారు.

**మధ్యాహ్నం వరకు ఎమ్మెల్యే కోసం ఎదురుచూపులే..**

చంద్రంపాలెం హైస్కూల్లో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు రాక కోసం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎదురు చూసినా రాలేదు. కూటమి నాయకులు తప్ప ప్రజాప్రతినిధుల జాడే కరువైంది. పాఠశాలలో సమస్యల గురించి తల్లిదండ్రులు సమావేశంలో వివరించారు.





చంద్రంపాలెం హైస్కూల్లో సమస్యలు వివరిస్తున్న పేరెంట్

**నీటి సమస్య తీవ్రం**

చంద్రంపాలెం హైస్కూల్ బయట డ్రగ్స్ బ్యాచ్ ప్రభావం విద్యార్థులపై పడుతోందని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని తల్లిదండ్రులు కోరారు. స్కూల్ వదిలే సమయాల్లో బాలికలను బయట ఆకతాయిలు వేధిస్తున్నారని తెలిపారు. నీటి సమస్య తీవ్రంగా వేధిస్తోందని, దీనివల్ల కొందరు పాఠశాల కూడా మానేస్తున్నారని చెప్పారు. దీనిని చిన్న సమస్యగా తీసుకోవద్దని కోరారు. పాఠశాల మైదానంలో వర్షం నీరు నిలిచిపోతోందని, మరుగుదొడ్లు అందరికీ సరిపోక.. ఉన్నవి కూడా కంపు కొడుతుండటంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు ఎం.వెంకటరావు, పాఠశాల కమిటీ చైర్మన్ అచ్యుతరావు ఆధ్వర్యంలో తల్లులను సత్కరించారు.

- కొమ్మాది రిక్షా కాలనీలోని విశాఖపట్నం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల సీవోఈలో ప్రిన్సిపాల్ సత్యవతి, కమిటీ చైర్మన్ బగాది జగదీశ్వరరావు ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. టెంట్లు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయకపోవడంతో తల్లిదండ్రులు చెట్లకిందనే కూర్చోవాల్సి వచ్చింది.
- ఏడో వార్డు వాంబేకాలనీ సునీల్‌శర్మ కాలనీలోని జెడ్పీ హైస్కూల్లో నిర్వహించిన కార్యక్రమానికి ఎంపీ భరత్ హాజరయ్యారు. ఇక్కడ కొత్తగా నిర్మిస్తున్న భవనాలకు గ్రిల్స్ ఏర్పాటు, పాఠశాల ఆవరణలో వర్షం నీరు నిలిచిపోయి తరగతి గదుల్లోకి వచ్చేస్తుందని పాఠశాలకు ఆట మైదానం ఏర్పాటు వంటి సమస్యలను తల్లిదండ్రులు తెలియజేశారు. వీటిని విద్యాశాఖ మంత్రి లోకేష్ దృష్టికి తీసుకువెళ్తానని ఎంపీ చెప్పారు. కార్పొరేటర్ మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.



కొమ్మాది గురుకుల సీవోఈలో చెట్ల నీడన కూర్చున్న తల్లిదండ్రులు



సంతపేట స్కూల్లో విద్యార్థిని అభినందిస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు రాముునాయుడు

**ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..**

**భీమునిపట్నం:** ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన పీటీఎంలో ఎమ్మెల్యే గంటా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పిల్లల పెంపకం, చదువు విషయంలో తల్లిదండ్రులు, గురువుల సహకారం ఎంతో కీలకమన్నారు. కళాశాలలో వేదిక నిర్మాణానికి రూ. రెండు లక్షలు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించి విట్స్‌లో సీట్లు పొందిన మైలిపల్లి త్రిలోచన, కారి రాకేష్‌కు రూ.1500 చొప్పున నగదు ప్రోత్సాహకాలు అందించారు. ప్రిన్సిపాల్ రాంప్రసాద్, జెడ్పీ అయ్యప్పనాయుడు, తహసీల్దారు రామారావు, ఎంఈవో శివరాణి, మూడో వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండ, జనసేన ఇన్‌చార్జి పంచకర్ల సందీప్ పాల్గొన్నారు.

- కస్తూర్బాగాంధీ విద్యాలయంలో ప్రిన్సిపాల్ గంగాకుమారి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో టెన్త్‌లో ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థినులను ఎస్ఎస్ఏ ఏపీసీ చంద్రశేఖరరావు సత్కరించారు. విద్యార్థినులు తల్లులకు పాదాభిషేకాలు చేశారు. పండిట్ నెహ్రూ హైస్కూల్ వద్ద హెచ్ఎం తిరుమల శ్రీదేవి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు తమ తల్లులకు పాద పూజ చేశారు.

**కొమ్మాది:** ఎండాడ జెడ్పీ హైస్కూల్లో హెచ్ఎం ఉషారాణి ఆధ్వర్యంలో పీటీఎం నిర్వహించారు. కార్పొరేటర్ లొడగల అప్పారావు, నాయకులు పాల్గొన్నారు.

**ఉన్నత విద్యావంతులు కావాలి**

**తగరపువలస:** విద్యార్థులు తల్లిదండ్రుల కష్టానికి తగినట్టుగా చదువుకుని ఉన్నత విద్యావంతులు కావాలని పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రాము నాయుడు కోరారు. జీవీఎంసీ ఒకటోవార్డు సంతపేట అంబేడ్కర్ జీవీఎంసీ హైస్కూల్‌లో జరిగిన మెగా టీచర్, పేరెంట్స్ సమావేశంలో ఆయన పాల్గొని విద్యార్థులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా చిల్లపేటకు చెందిన చిల్ల ధర్మారెడ్డి జ్ఞాపకార్థం నీలాపు శంకరరెడ్డి విద్యార్థులకు రూ.5వేల నగదు బహుమతులు అందించారు. రెడ్డిపల్లి అప్పలరాజు తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. భీమిలి మండలం దాకమర్రి జెడ్పీ హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు చెల్లూరి నగేష్ పాల్గొన్నారు.

**ఉపాధ్యాయులకు సన్మానం**

**పద్మనాభం:** పద్మనాభం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన మెగా పీటీఎంలో ఈ పాఠశాల ఏర్పాటుకు, అభివృద్ధికి దోహద పడిన కృష్ణాపురం గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు మొకర అప్పలనాయుడును ఘనంగా సత్కరించారు. పాఠశాల తరఫున మండల పరిషత్ సూపరింటెండెంట్ జయ ఉమ, హెచ్ఎం ఎ.బాలామణి, ఉపాధ్యాయులు దుశ్శాలువాతో సన్మానించారు. నాయకులు కంటుబోతు ఏర్నాయుడు, తాలాడ పైడిరాజు పాల్గొన్నారు.



రిటైర్డ్ ఉపాధ్యాయుడు అప్పలనాయుడును సన్మానిస్తున్న జయ ఉమ, ఉపాధ్యాయులు

- కురపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు బ్యాగ్‌లు, శశికళలను రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రూపాకుల రవి కుమార్ సన్మానించారు.
- పీఎం పాలెం: ఆరోవార్డు బక్కన్నపాలెం ప్రభుత్వ హైస్కూల్లో విద్యార్థుల తల్లులకు ముగ్గుల పోటీలు, తండ్రులకు టగ్ ఆఫ్ వార్ వంటి పోటీలు నిర్వహించారు. గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## విద్యార్థులతో అబద్ధాలు చెప్పించి

- బూట్లు ఇవ్వకపోయినా ఇచ్చారని..
- యూనిఫాం అన్ని జతలు ఇచ్చేశారని..
- ఎమ్మెల్యే మెప్పు కోసం పాట్లు



ఆనందపురం హైస్కూల్లో ఎమ్మెల్యే గంటాతో మాట్లాడుతున్న విద్యార్థికి బూట్లు లేని దృశ్యం

**తగరపువలస:** పాఠశాలలు పునఃప్రారంభించి నెల రోజులు గడిచినా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బూట్లు పంపిణీ కాలేదు. కానీ, ఆనందపురం జెడ్పీ హైస్కూల్లో జరిగిన మెగా టీచర్, పేరెంట్స్ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మెప్పు కోసం పాఠశాల యాజమాన్యం విద్యార్థులతో అబద్ధాలు చెప్పించారు. విద్యార్థి మిత్ర కిట్లలో భాగంగా మూడు యూనిఫాంలు, బూట్లు పంపిణీ చేసినట్టు సమావేశంలో చెప్పించారు. వాస్తవానికి ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు పాఠశాలలకు బూట్లు పంపిణీ కాలేదు. వేదికపై డీఈవో ప్రేమ్‌కుమార్, డిప్యూటీ డీఈవో సోమేశ్వరరావు కూడా బూట్ల పంపిణీ గురించి ఖండించలేదు. బాలికలకు యూనిఫారాలు కూడా రెండే పంపిణీ చేసినట్టు బయట విద్యార్థినులు తెలిపారు.

# భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి

- సాయినాథుడికి అన్నాభిషేకం
- ఆలయాల్లో అన్న సమారాధనలు



లక్ష్మీవానిపాలెంలో ప్రత్యేక అలంకరణలో ..

**మధురవాడ:** గురుపౌర్ణమి పర్వదినాన్ని నియోజకవర్గంలో భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయ ఆవరణలో గల సాయిబాబా మందిరంలో స్వామికి సుగంధ, పంచామృత, క్షీరాభిషేకాలు చేశారు. అన్నాభిషేకం నిర్వహించి సుమారు 4 వేల మందికి అన్నప్రసాదం అందించారు. మధురవాడ రాగ మ్యూజిక్ అకాడమీ నాగజ్యోతి బృందం భక్తి కచేరీ భక్తులను ఆకట్టుకుంది. కార్యక్రమాలను పెద్దలు పిళ్లా రమణమూర్తి, ధర్మకర్త పిళ్లా చంద్రశేఖర్, కమిటీ అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు, ఉపాధ్యక్షుడు పీవీజీ అప్పారావు, కార్యదర్శి నాగోతి తాతారావు, కార్యవర్గ సభ్యులు పర్యవేక్షించారు.

- స్వతంత్రనగర్‌లోని పెద్ద సాయిబాబా ఆలయంలో బాబాను ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. అన్నాభిషేకం నిర్వహించారు. కార్పొరేటర్లు పిళ్లా మంగమ్మ, మొల్లి హేమలత, ఏపీ నగరాలు కార్పొరేషన్ మాజీ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు, నాయకులు వరలక్ష్మి, జీలకర్ర గణేష్, బెల్లాపు పాపారావు, నాగోతి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**లక్ష్మీవానిపాలెంలో అన్నసమారాధన**

**పీఎం పాలెం:** జీవీఎంసీ ఆరోవార్డు లక్ష్మీవానిపాలెం షిర్డీ సాయిబాబా ఆలయంలో వేకువజామున కాకడ ఆరతితో పూజలు ప్రారంభమయ్యాయి. 6.30 గంటల నుంచి పంచామృతాలతో బాబాను అభిషేకించి, ప్రత్యేకంగా అలంకరించారు. మధ్యాహ్నం సుమారు 3 వేలమందికి అన్న సమారాధన నిర్వహించారు.



చంద్రంపాలెం దుర్గాలమ్మ గుడి ఆవరణలో సాయినాథుడికి అన్నాభిషేకం

**శ్రీ శృంగేరీ శంకర మఠం వద్ద..**

స్థానిక శృంగేరీ శంకర మఠంలోని జగద్గురు శంకరాచార్యునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మఠం గౌరవ పరిపాలన అధికారి జె.వెంకటేశ్వర్లు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

**స్వామి యోగానంద ప్రార్థన మందిరంలో..**

**తగరపువలస:** చిట్టివలసలోని స్వామి యోగానంద ప్రార్థనా మందిరంలో గురువారం భారీ అన్న సమారాధన చేశారు. పత్రి ఎల్లయ్యమ్మ సేవా సమితి, కేజీహెచ్ పూర్వ సూపరింటెండెంట్ పత్రి శివానంద ఆధ్వర్యంలో ఈ అన్నదానం జరిగింది. అనంతరం పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. స్థానిక పెద్దలు కాళ్ల శ్రీనివాస్, పిట్ట వెంకటరావు, సేవాసమితి సభ్యులు రామకృష్ణ, సత్యానంద, యోగానంద తదితరులు సహాయ సహకారాలు అందించారు.



స్వతంత్రనగర్ సాయిబాబా గుడిలో పూజల్లో పాల్గొన్న శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు



అన్నదానం చేస్తున్న కేజీహెచ్ రిటైర్డ్ సూపరింటెండెంట్ శివానంద

**ఆనందాశ్రమంలో..**

**తగరపువలస:** గురుపౌర్ణమి సందర్భంగా భీమిలి మండలం మజ్జివలసలోని ఆనందాశ్రమాన్ని బీజేపీ వైద్య విభాగానికి చెందిన రూపాకుల రవికుమార్ సందర్శించారు. ఆశ్రమంలో స్వామీజీ చిరంజీవి వర్మ ఆయనకు ప్రబోధానందుడు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీతను బహూకరించారు. బీజేపీ పద్మనాభం మండల అధ్యక్షురాలు తమటపు నాగమణి తదితరులు మొక్కలు నాటారు.



చిరంజీవి వర్మ స్వామీజీచే త్రైత సిద్ధాంత భగవద్గీత బహూకరణ

## మధ్యవర్తిత్వంతో కేసుల సత్వర పరిష్కారం



మధ్యవర్తిత్వ విధానంపై కరపత్రాన్ని కక్షిదారుకు అందిస్తున్న మేజిస్ట్రేట్ స్వాతి భవాని

**భీమునిపట్నం:** కోర్టుల్లోని పలు కేసుల సత్వర పరిష్కారానికి మధ్యవర్తిత్వ విధానం ఎంతో ఉపయోగపడుతుందని మండల న్యాయ సేవా సంస్థ చైర్‌పర్సన్, మేజిస్ట్రేట్ పి.స్వాతి భవాని అన్నారు. దీనిగురించి అందరూ తెలుసుకోవాలని సూచించారు. మధ్యవర్తిత్వ ప్రజా అవగాహనపై వారం రోజులు జరిగే అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆమె మాట్లాడారు. గుర్తింపు, శిక్షణ పొందిన మధ్యవర్తులు ఉంటారని, వారు ఆయా కేసుల గురించి అవగాహన కల్పిస్తారని తెలిపారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**పద్మనాభం:** పద్మనాభం సబ్ స్టేషన్ పరిధిలోని పద్మనాభం టౌన్, రేవిడి రూరల్ ఫీడర్ లైన్లలో చెట్ల కొమ్మలు తొలగించనున్నందున ఈ ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ జగన్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా పద్మనాభం, కురపల్లి, బర్లపేట గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

### 'అన్నదాత సుఖీభవ' జాబితా తనిఖీ చేసుకోండి

**తగరపువలస:** అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం లబ్ధిదారులు రైతు సేవా కేంద్రాల్లోని జాబితాలలో తమ పేర్లు తనిఖీ చేసుకోవాలని భీమిలి వ్యవసాయాధికారి బి.శివకోమలి కోరారు. అర్హత ఉండి జాబితాలో పేర్లు లేని వారు తమ భూమికి సంబంధించి పత్రాలు, ఆధార్‌కార్డుతో అన్నదాత సుఖీభవ గ్రీవెన్స్ పోర్టల్‌లో ఈ నెల 13లోగా నమోదు చేసుకోవాలన్నారు. ఆధార్ నంబర్ భూమి పత్రాలకు లింక్ కాకపోయినా కూడా సంప్రదించాలని సూచించారు.

### ఆస్తి కాజేసి.. ఆపై దౌర్జన్యం

**తగరపువలస:** వారసత్వంగా రావలసిన వాటాను తన బావ, మరిది కుటుంబ సభ్యులు కాజేశారని, అడగడానికి వెళ్తే చావగొట్టారని ఆనందపురం మండలం పాలవలస పంచాయతీకి చెందిన మద్ది శివ అనే మహిళ వాపోయింది. వివరాలివి.. ఇదే పంచాయతీకి చెందిన మద్ది సూరీడు, సీతయ్యమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు. శివ భర్త అప్పలనాయుడు, ఆమె మరిది నరసింగరావు మరణించగా, బావ లక్ష్మీనాయుడు, అత్త సీతయ్యమ్మ జీవించి ఉన్నారు. వారికి పంచాయతీ ఉమ్మడిగా ఉన్న 4.70 ఎకరాల డీ పట్టా భూమిని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగనన్న కాలనీ కోసం వీఎంఆర్డీఏకు ఇవ్వగా, ప్రతిఫలంగా అప్పటి ప్రభుత్వం వీరికి 4230 గజాల స్థలాన్ని ఇచ్చింది. దీనిని సమానంగా పంచాల్సి ఉండగా, కుటుంబసభ్యులు తనకు ఒక్క గజం కూడా ఇవ్వలేదని, దీనిపై న్యాయస్థానాన్ని ఆశ్రయించానని తెలిపింది. గురువారం స్థలం విషయమై వెళ్లగా బావ కుమారుడు శేఖర్, రెడ్డి మహేష్ అనే వ్యక్తి తనపై, తన అల్లుడు పాలవలస రమేష్‌పై దాడి చేశారని వాపోయారు. దీనిపై ఆనందపురం పోలీసులకు మరోమారు ఫిర్యాదు చేశారు. టీడీపీ అండతోనే వారు ఇలా చేస్తున్నారని, తనకు, తన కుమార్తెలకు ప్రాణభయం ఉందని శివ వాపోయారు.



బాధిత అత్తా అల్లుడు మద్ది శివ, రమేష్